క్లుప్తంగా

కళలతో మానసిక ప్రశాంతత

అల్లిపురం : కళలు హృదయానికి ఆనందాన్ని ఇవ్వడం మాత్రమే కాకుండా మనో వికాసానికి దోహదపడతాయని ఉపకార్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ కంచర్ల అచ్యుత రావు అన్నారు. శనివారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మహానటి శ్రీదేవి సంగీత సాంస్కృతిక సంస్థ నిర్వహించిన సినీ సంగీత విభావరి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటల కచేరీలు నిర్వహించడం వల్ల వర్ధమాన గాయకుల్లో దాగిన ప్రతిభను బయటకు తీయవచ్చన్నారు. పేద వృత్తి కళాకారులను ఆదుకోనున్నట్లు తెలిపారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో గాయనీ గాయకులు పాడిన పాటలు అలరించాయి. సంస్థ వ్యవస్థాపకులు జేఎంఆర్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా అతిథులు, కళా సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, సకల కళాకారుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ జాలాది విజయ, వికాసం మాజీ గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, ఘంటసాల క్రీడా సాంస్కృతిక సంఘం వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, సభ్యులు విజయ్ రమణి, సన్‌మూర్తి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఆరిలోవ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా శనివారం జీవీఎంసీ పన్నెండో వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ స్థానిక కార్యకర్తలతో కలసి పుట్టినరోజు కేక్‌ను ఆమె కట్‌చేశారు. అనంతరం వార్డులో కొత్తగా మంజూరైన వారికి పింఛన్లు అందజేశారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది పలువురికి మధుమేహం, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులు ఉచితంగా అందజేశారు.

జేసీఐ విశాఖకు అవార్డు



జేసీఐ జోన్ ప్రెసిడెంట్ జి.ఎస్.వర్మ నుంచి అవార్డు స్వీకరిస్తున్న లక్ష్మీ సురేఖ

మద్దిలపాలెం: జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ విశాఖ ప్రైడ్ చాప్టర్‌కి జైత్ర అవార్డు లభించింది. జేసీఐ వీక్ సందర్భంగా చేపట్టిన సేవా కార్యక్రమాలకు ఈ అవార్డును అందజేశారు. మద్దిలపాలెంలో ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును శనివారం జేసీఐ జోన్ ప్రెసిడెంట్ జి.ఎస్.వర్మ చేతులమీదుగా విశాఖ ప్రైడ్ ప్రెసిడెంట్ కె.లక్ష్మీ సురేఖ అందుకున్నారు. ఈ సందర్భంగా నూతన ప్రెసిడెంట్ కె.లక్ష్మి సురేఖ మాట్లాడుతూ జేసీఐ సేవా కార్యక్రమాలను మరిన్ని చేపడతామన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈసందర్భంగా ఉచితంగా వైద్య సేవలందిస్తున్న వి.డెంటల్ కేర్ హాస్పటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జేసీఐ వైజాగ్ స్మార్ట్ ప్రెసిడెంట్ ప్రవంతి, చందు కటకం, కె.శ్రీను, అశోక్‌లు పాల్గొన్నారు.

తారా మసీద్ షాదీ ఖానా నిర్మాణానికి ఎంపీ నిధులు



పరిశీలిస్తున్న పీతల గోవింద్

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు మంగాపురం కాలనీలో తారా మసీద్ షాదీ ఖానా నిర్మాణానికి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నిధులు కేటాయించారు. ఈ మేరకు శనివారం జీవీఎంసీ ఏఈ శిరీష, కార్యదర్శి కార్తీక్, వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పీతల గోవింద్ నిర్మాణ ప్లానింగ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నిజముద్దీన్ కుదబాషు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పోర్ట్ హార్బర్



ఏయూ విద్యార్థులు రూపొందించిన పోర్ట్ నమూనా

ఏయూ సివిల్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థినులు రసజ్ఞ, ప్రియాంక, లహరిలు పోర్ట్ హార్బర్‌ను తయారు చేశారు. సముద్రం నుంచి నౌకలు వచ్చి వెళ్లే మార్గాలు, జెట్టీలు వంటివి కార్డ్‌బోర్డుతో తయారు చేసి పోర్టు పనితీరును కళ్లకు కట్టినట్టు వివరించారు.

ట్రాఫిక్ కంట్రోలర్



విజయవాడ సిద్ధార్థ కాలేజీ విద్యార్థులు తయారు చేసిన ట్రాఫిక్ కంట్రోలర్ పరికరాలు

విజయవాడ వి.ఎస్. సిద్ధార్థ కళాశాలకు చెందిన విద్యార్థులు పి.అష్రఫ్, దేవి శ్రీ, శ్రీవల్లి వన్ వే ట్రాఫిక్ కంట్రోలర్ పరికరాలను తయారు చేశారు. ట్రాఫిక్ నియమావళికి విరుద్ధంగా రాంగ్ రూట్‌లో ప్రయాణించాలని చూసే వాహనాలకు అడ్డుకట్ట వేసే విధంగా విద్యార్థులు ఈ అధునాతన వ్యవస్థకు రూపకల్పన చేశారు.

ఆలోచనలకు రూపం.. ఆవిష్కరణలతో ప్రాణం

ఏయూ క్యాంపస్: విద్యార్థుల మస్తిష్కంలో ఉద్భవించిన ఆలోచనలకు రూపం కల్పించారు. నూతన ఆవిష్కరణలతో ప్రాణం పోశారు. సివిల్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలకు తమ మేధస్సును జోడించారు. వీటిని ఆచార్యులు ముందు ప్రదర్శించారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో జరుగుతున్న రెండు రోజుల సదస్సు ఎక్సెస్ 2కే23 దీనికి వేదికగా నిలచింది. విద్యార్థుల నమూనాలను ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, కె.దుర్గారాణిలు పరిశీలించి, విజేతలను ఎంపిక చేశారు.

స్మార్ట్ సిటీ



శ్రీకాకుళం వేంకటేశ్వర కళాశాల విద్యార్థుల స్మార్ట్ సిటీ నమూనా

శ్రీకాకుళం వేంకటేశ్వర కళాశాలకు చెందిన ఎస్.బాలాజి, పి.పవన్, ఎన్.నాగేంద్రలు స్మార్ట్ సిటీ రూపకల్పనపై నమూనా తయారు చేశారు. నగరాన్ని వివిధ సెక్టార్లుగా విభజించి, రవాణా సదుపాయాల కల్పన దిశగా దీనిని తీర్చిదిద్దారు. రోడ్డు రవాణా మెరుగ్గా ఉంటే, మౌలిక వసతులు కల్పన, పర్యాటకం పెరుగుతాయని విద్యార్థులు తమ ప్రాజెక్టులో సూచించారు.

స్మార్ట్ హోమ్



అనిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల స్మార్ట్ హోమ్

అనిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కె.రామలక్ష్మి, జి.చైతన్య శ్రీ, ఎం.లలిత్ వర్ధన్, వి.దుష్యంత్, జి.రాజశేఖర్, జి.సోమశేఖర్‌ల బృందం స్మార్ట్ హోమ్‌ను ఏర్పాటు చేశారు. బ్లూ టూత్‌సహాయంతో ఇంటిలోపల గృహోపకరణాలను ఆపరేట్ చేయడాన్ని తయారు చేశారు. విద్యుత్ ఆదా చేస్తూ, సౌకర్యవంతమైన సేవలను అందించే విధంగా దీనిని తీర్చిదిద్దారు. భవిష్యత్తులో దీనికి వైఫై అనుసంధానంతో దూర ప్రాంతాల నుంచి ఆపరేట్ చేసే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు.

ఆవిష్కర్తలుగా ఇంజినీర్లు నిలుస్తారు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న రెక్టార్ ఆచార్య సమత, రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: సమాజంలో నూతన ఆవిష్కరణలు జరిపే వ్యక్తులుగా ఇంజినీర్లు నిలుస్తున్నారని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఏయూ వై.వి.ఎస్. మూర్తి ఆడిటోరియంలో రెండు రోజుల పాటు జరిగిన సదస్సు ఎక్సెస్ 2023 ముగింపు సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. సర్‌మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎన్నో ప్రతిష్టాత్మక, చారిత్రాత్మక ప్రాజెక్టులను నిర్మించారని గుర్తు చేశారు. విశాఖ తీరంలో సముద్ర కోతను నివారించడానికి ఆయన అందించిన సూచనలు ఎంతగానో ఉపకరించాయని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల్లో పాల్గొనడం వల్ల నాయకత్వ లక్షణాలు, బృందంలో పనిచేయడం అవలవడతాయన్నారు. మార్పును స్వీకరిస్తూ ముందుకు సాగడం అలవాటు చేసుకోవాలని సూచించారు. నిరంతరం జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలన్నారు. పర్యావరణహిత నిర్మాణాలు పెరగాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా యువ ఇంజినీర్లు పనిచేయాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి సత్యనారాయణ మాట్లాడుతూ నూతన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా నిలచిందన్నారు. విభిన్న ప్రాంతాల నుంచి ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సదస్సు సహ కన్వీనర్ రాజశేఖర్ తదితరులు ప్రసంగించారు. అనంతరం క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, మోడల్స్ తయారీలో పాల్గొని విజేతలుగా నిలచిన వారికి బహుమతులు అందజేశారు. మోడల్స్ తయారీలో ఏయూ విద్యార్థులు ప్రథమ, గాయత్రి కళాశాల విద్యార్థులు ద్వితీయ, అనిట్స్ కళాశాల విద్యార్థులు తృతీయ బహుమతులను సాధించారు.

69 నంబరు బస్సు సర్వీసుల పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..



ఆరిలోవ నుంచి తిరుగుతున్న 69 నంబరు సిటీ బస్

ఆరిలోవ: రైల్వే స్టేషన్ నుంచి ఆరిలోవకు నడిచే 69 సిటీ బస్సు సర్వీసులను పునరుద్ధరించారు. వాల్తేరు డిపోకి చెందిన 60 సి నంబరు బస్సులు ఆరిలోవ నుంచి పాత పోస్టాఫీస్‌కు, మద్దిలపాలెం డిపోకి చెందిన 69 నంబరు గల సిటీ బస్సులు ఆరిలోవ నుంచి రైల్వే స్టేషన్‌కు నిత్యం తిరుగుతుండేవి. నాలుగు నెలల క్రితం 69 నంబర్ బస్సు సర్వీసులను మద్దిలపాలెం డిపో ఆర్టీసీ అధికారులు ఆకస్మికంగా నిలిపేశారు. దీంతో ఈ ప్రాంతం ప్రజలు రైల్వే స్టేషన్‌కు, ఆ మార్గంలో ఉన్న హెచ్‌బీ కాలనీ, సీతమ్మధార, సత్యం జంక్షన్, గురుద్వార, సీతమ్మపేట వెళ్లడానికి ఇబ్బందిపడ్డారు. దీనిపై గత నెల 9న '69 నంబరు బస్సులను పునరుద్ధరించాలి' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు ఆర్టీసీ అధికారులు స్పందించారు. మళ్లీ ఆ సర్వీసులను ఇటీవల పునరుద్ధరించారు. రెండు రోజులుగా ఆరిలోవ నుంచి రైల్వేస్టేషన్‌కు 69 నంబరు బస్సులు తిరుగుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళా కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్



ఏయూ వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న లెక్చరర్ లావణ్య

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మహిళా కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న జక్కపు లావణ్యకు డాక్టరేట్ లభించింది. శనివారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఆమె డాక్టరేట్ ఉత్తర్వులను స్వీకరించారు. వృక్షశాస్త్ర ఆచార్యులు డాక్టర్ డి.సంధ్య దీపిక పర్యవేక్షణలో కోరింగ మడ అడవుల పర్యావరణ వ్యవస్థలోని మొక్కల నుంచి జీవ ఉపయోగకర బాక్టీరియాలను వేరుచేసి పరీక్షించే పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా లావణ్యను విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

బీచ్ రోడ్డులో స్టాపర్ల ఏర్పాటు



జూ పార్కు సమీప బీచ్ రోడ్డులో స్టాపర్లు ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఆరిలోవ: బీచ్ రోడ్డులో ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. మలుపులు, ప్రధాన కూడళ్ల వద్ద స్టాపర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా బీచ్ రోడ్డులో జోడుగుళ్లపాలెం నుంచి రుషికొండ వరకు శనివారం వీటిని ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. రెండు నెలల వ్యవధిలో ఈ మార్గంలో మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు ప్రమాదాల కట్టడికి జోడుగుళ్లపాలెం, సీతకొండ వద్ద మూడు మలుపులు, విశాఖ వ్యాలీ స్కూల్ జంక్షన్, జూ పార్కుతోపాటు ఆలయాలు, హోటళ్ల వద్ద రబ్బర్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ కుమార్ తెలిపారు.

ఓజోన్ పొరను కాపాడుకోవాలి



ఓజోన్ పొర గురించి వివరిస్తున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఓజోన్ పొరపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఇక్కడ పాఠశాల విద్యార్థులకు ఓజోన్ పొర పరిరక్షణ, పర్యావరణంపై వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలసి పాఠశాల నుంచి పెదగదిలి కూడలి వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని దుర్గాభవాని మాట్లాడుతూ ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఓజోన్ పొరను మనం సంరక్షించుకొంటే ఆ పొర అతినీల లోహిత కిరణాలు నుంచి మనల్ని కాపాడుతుందన్నారు.

ఐఐఏఎం ఆధ్వర్యంలో...

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఓజోన్ డే 2కే23ని ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా సర్కిల్ నుంచి ఐఐఏఎం క్యాంపస్ వరకు జరిగిన ఈ ర్యాలీలో సంస్థ కార్యదర్శి సుంకరి రవీంద్రతో పాటు నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్ పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఐఐఏఎం క్యాంపస్‌ను చేరుకున్నారు. అనంతరం జరిగిన సదస్సులో ఆచార్య బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించడం ద్వారానే ఓజోన్ పొరను రక్షించగలమన్నారు. ఈ విషయంలో అందరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ఉద్యోగులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో ...

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తుపాను హెచ్చరిక కేంద్రం సంచాలకులు సునంద, కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాసరావు అతిథులుగా పాల్గొన్నారు.

ఈసందర్భంగా ఓజోన్ పొర పరిరక్షణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం గ్రీన్ క్లయిమేట్ టీం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జనపరెడ్డి రత్నం మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణకు విస్తారంగా మొక్కలు పెంచాలని, దట్టమైన అడవులు అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

వెంకన్న ఆలయంలో ఎంవీవీ పూజలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఎంవీవీ

ఏయూ క్యాంపస్: స్థానిక పెదవాల్తేరు ఎల్‌బీ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఎంవీవీ సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయ కార్య నిర్వాహకసభ్యులు, దేవాలయ ప్రధాన అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాక సభ్యులు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న సూరాడ దాసు తదితరులు



మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేసేందుకు ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణ హిత వేడుకల్లో భాగంగా ఎంపీ ఎంవీవీ ప్రకటించిన విధంగా వినాయక మట్టి ప్రతిమలను శనివారం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆయా వార్డుల్లో విస్తృతంగా ఈ ప్రతిమలను పంపిణీ చేశారు. తూర్పు నియోజకవర్గంలోని 92 సచివాలయాల పరిధిలో 92 వేల వినాయక మట్టి ప్రతిమలను పంపిణీకి ఎంపీ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 19వ వార్డు వాసవానిపాలెంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, పార్టీ సీనియర్ నాయకుడు సూరాడ దాసు, పీలా ప్రేమ్ తదితరులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలను పంపిణీ చేసిన సత్యసాయి విద్యార్థులు

ఎంవీపీకాలనీ: వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణ హిత పండగపై అవగాహన కల్పిస్తూ శ్రీసత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఎంవీపీ కాలనీలోని పాఠశాల చుట్టుపక్కల నివాసాల వారికి వారు స్వయంగా తయారు చేసిన మట్టి ప్రతిమలను అందజేశారు. శనివారం ఉదయం ర్యాలీగా ఆయా నివాసాలకు వెళ్లి మట్టి ప్రతిమలను అందజేయడంతో పాటు వినాయక చతుర్థిని పర్యావరణ హితంగా జరుపుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అయ్యగారి కౌసల్య మాట్లాడుతూ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛంద కార్యక్రమాల్లో భాగంగా పర్యావరణంపై అవగాహన, మట్టి వినాయక ప్రతిమల పంపిణీ జరిగిందన్నారు. పాఠశాల విద్యార్థులంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయినట్లు తెలిపారు.

సీఎంఆర్ సెంట్రల్‌లో విత్తనాల వినాయక ప్రతిమల పంపిణీ



విత్తనాల వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ

మద్దిలపాలెం: మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో విత్తనాల వినాయక ప్రతిమలను శనివారం సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షకు పైగా విత్తనాలతో కూడిన వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా ఉండే విధంగా వీటి అందజేశామన్నారు. ఈ ప్రతిమలను ఇళ్లలోనే నిమజ్జనం చేసుకోవాలని, నిమజ్జనం అనంతరం మట్టిని కుండీలలో వేస్తే మొక్కలు మొలకెత్తుతాయన్నారు. విత్తనాల ప్రతిమలను తెలుగు రాష్ట్రాల్లో పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. విశాఖపట్నంతో పాటు నరసన్నపేట, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, నర్సీపట్నం, కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, భీమవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, ఖమ్మం, కొత్త గూడెం సీఎంఆర్ షాపింగ్ మాల్స్‌లో అందజేస్తున్నామన్నారు.

మేయర్‌ను కలిసిన జీవీఎంసీ కాంట్రాక్టర్లు



మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

దాబాగార్డెన్స్ : కొత్తగా ఎన్నికైన జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం శనివారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని మర్యాదపూర్వకంగా కలిసింది. అధ్యక్షుడు గొంప చంద్రమౌళి ఎన్నికైన కార్యవర్గ సభ్యులను మేయర్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ జనవరి నుంచి ఏప్రిల్ 2023 వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణం చెల్లించాలని, సాంకేతిక సమస్యలను నివారించాలని కోరారు. అధికారులు, కాంట్రాక్టర్లతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అందుకు మేయర్ స్పందిస్తూ త్వరలోనే అధికారులు, కాంట్రాక్టర్లతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు. కన్వీనర్ రాజాన వెంకట్రావు, కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షుడు పీఎస్ ప్రసాద్, బి. రామానాయుడు, ఎం. సంజీవరెడ్డి, జి. దేముడు, సలహాదారులు పైలా కృష్ణారావు, సీహెచ్ ప్రసాద్, బి. సత్యనారాయణ, ఆర్ఎస్ నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి అల్లు గోవిందరావు, ఆడిటర్ ఎస్. రవీంద్ర, జాయింట్ సెక్రటరీ పిల్లా సూరిబాబు, సత్యనారాయణ, రాజాన రాంబాబు, గణేష్, ఎస్. శ్రీనివాస్, అప్పన్న, అశ్వనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతులు,దిగుమతులపై సదస్సు



సదస్సులో పాల్గొన్న మనోహర్ నాయుడు

బీచ్‌రోడ్డు: నూతన విదేశీ వాణిజ్య విధానం, కస్టమ్స్ అండ్ ఎగుమతులు, దిగుమతుల కోసం ఫైనాన్సింగ్ అనే అంశంపై శనివారం ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విశాఖపట్నం కస్టమ్స్ అధికారి మనోహర్ నాయుడు అధీకృత ఆర్థిక ఆపరేటర్, డిఫర్డ్ పేమెంట్ ఆఫ్ డ్యూటీ స్కీమ్‌ల కోసం వివరించారు. ఎగుమతిదారులకు అందుబాటులో ఉన్న వివిధ ఎగుమతి ప్రోత్సాహక పథకాలను విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మ్యానిఫెస్టోలో 'పర్యావరణ పరిరక్షణ' చేర్చాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న యువతీయువకులు

బీచ్‌రోడ్డు: రాబోయే 2024 సాధారణ ఎన్నికల మ్యానిఫెస్టోలో అన్ని రాజకీయ పార్టీలు పర్యావరణ పరిరక్షణ అంశాన్ని పొందుపర్చాలని యువతీయువకులు నినాదించారు. శనివారం ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్, క్లయిమేట్ ఫ్రంట్ ఇండియా సంయుక్తంగా ఆర్కేబీచ్‌లో గ్లోబల్ క్లయిమేట్ స్ట్రైక్ ర్యాలీ నిర్వహించాయి. ఈ ర్యాలీలో పాల్గొన్న యువతీ యువకులు పర్యావరణ పరిరక్షణ కోసం నినాదించారు. పోర్ట్ ట్రస్ట్ సమీపంలోని వైజాగ్ మడ అడవులను పరిరక్షణ, తీర ప్రాంతాలు పరిరక్షణ, ప్లాస్టిక్ సమస్య, చెట్ల నరికివేయడం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.